క్లుప్తంగా

ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలి


సూచనలిస్తున్న ఏడీ తిరుమలరావు, సిబ్బంది

చింతపల్లి: రైతులు ఈనెల 25లోపు ఈ క్రాప్‌ను రైతులు పూర్తి చేసుకోవాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బీవీ తిరుమలరావు సూచించారు. ఈ-క్రాప్ నమోదులో భాగంగా ఏవో మదుసూధన్‌తో కలిసి బుదవారం స్థానికంగా ఉన్న వరి పొలాలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 25లోగా చెప్పారు. రైతులు ఈ-క్రాప్ నమోదుపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. వరికి వచ్చే తెగుళ్లపై అవగాహన కల్పించాలని ఆయన ఏవోను కోరారు. ఈ-క్రాప్ నమోదుతో కలిగే లాభాలను ఆయన వివరించారు.

వాహనాల తనిఖీ


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

కొయ్యూరు: మండలం చీడిపాలెం జంక్షన్‌లో బుధవారం మంప ఎస్ఐ కె.శంకర్‌రావు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలను ముమ్మరం చేశామని ఎస్ఐ తెలిపారు. కాకరపాడు నుంచి కొయ్యూరు, బూదరాళ్ల వెళ్లే అన్ని వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గిరిజనులు గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలన్నారు. వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పండ్ల తోటల పెంపకంపై శ్రద్ధ


సూచనలిస్తున్న ఎంపీడీవో కుమార్

అడ్డతీగల: పండ్ల తోటల పెంపకంపై గిరిజనులు శ్రద్ధ వహించాలని ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ అన్నారు. వీరవరం, వేటమామిడి గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకాన్ని బుధవారం పర్యవేక్షించినట్టు ఆయన తెలిపారు. జీడిమామిడి, కొబ్బరిపంటల పండిస్తున్న రైతులకు నేరుగా కలిసి పలు సూచనలు చేశామన్నారు. వేసవిలో నీళ్ల పోత, అంతర్గత పంటలు వేసినందుకు ఎరువులు, పురుగుమందులు రైతులకు అందజేయనున్నట్టు చెప్పారు.ఉపాధి హామీ ఏపీవో చిరంజీవిరావు, జేఈ బాల శ్రీను, టీఏ అబ్బాయిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు యార్లగడ్డ విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం పావని, ఉపాధ్యాయ బృందం

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థినులు ఈనెల 9న రంపచోడవరం మండలం ముసురుమిల్లిలో జరిగిన డివిజన్ స్థాయి క్రీడల్లో విజయం సాధించారు. వీరిలో ఏడుగురు విద్యార్థినులు త్వరలో జరగనున్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.పావని తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు పావనితో పాటు వార్డెన్ బి.రోజారాణి, పీడీ ఎ.బాలరాజు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయా విద్యార్థినులను అభినందించారు.

డీఆర్ డిపో డీలర్ల వినతి


తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న డీలర్లు

కొయ్యూరు: డీఆర్ డిపోలకు సరఫరా చేసే సరకులను ఎం.ఎల్.ఎస్. పాయింట్ వద్ద తూకం వేసి అందజేయాలని తహసీల్దార్ ప్రసాద్‌కు డిపో డీలర్లు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఇప్పటివరకు ఈ ప్రక్రియ ఆఫ్‌లైన్ కావడంతో వినియోగదారుల ద్వారా ఈ ప్రక్రియ జరిగేదని, ప్రస్తుతం ఆన్‌లైన్ కావడంతో ఎం.ఎల్.ఎస్. పాయింట్‌ల వద్ద తూకం వేయాల్సి ఉంటుందన్నారు. సరకులను ప్రతి నెల 25వ తేదీలోగా సరఫరా చేయాలని కోరారు.

వెతలు తీరేనా?


పాడి-రత్నంపేట వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు (ఫైల్)


దెబ్బతిన్న దారపల్లి కల్వర్టు

- దెబ్బతిన్న కల్వర్టులు, వంతెనలు
- రాకపోకలకు అవస్థలు
- పట్టించుకోని అధికారులు


సాండ్‌కోరిలో నిరుపయోగంగా తాగునీటి పథకం

ముంచంగిపుట్టు: మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ దారపల్లి గ్రామ సమీపంలో కల్వర్టు కుంగిపోవడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు కుంగిపోయి నెలలు గడుస్తున్నా నేటికి దానిని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు మరింతగా పాడైపోయింది. దారపల్లి,రాములు, గడ్డిబంధ, వర్కుగుమ్మి గ్రామాల గిరిజనులు రాకపోకలకు పడరాని పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా ఆటోలు, జీపులు, వ్యాన్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కేవలం ద్విచక్రవాహనాలు మాత్రమే అతికష్టం మీద కల్వర్టును దాటించుకొని వెళ్తున్నారు. వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నూతన కల్వర్టును నిర్మించి, రాకపోకలకు ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పాడైన వంతెనతో ఇక్కట్లు

కొయ్యూరు: మండలంలోని పాడి-రత్నంపేట వంతెన పాడైపోవడంతో ఆ మార్గంలో ప్రయాణించే వారంతా అవస్థలు పడుతున్నారు. మూడు సంవత్సరాల కిందట వంతెన శ్లాబ్ పాడైపోయింది. నాటి నుంచి రాకపోకలు పూర్తిగా జరగడం లేదు. ద్విచక్ర వాహనాలు మాత్రమే వెళ్తున్నాయి. ఇటీవల కురుస్తున్న వర్షాలకు శ్లాబ్ మొత్తం పాడైంది. దీంతో రాకపోకలు బాలారం, కంఠారం, బకులూరు, ఆడాకుల, ఆర్.కొత్తూరు పంచాయతీల నుంచి కృష్ణాదేవిపేట వచ్చే వారంతా ఈ రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పుడు వంతెన పాడైపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పాడైన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటికి అవస్థలు

సీలేరు: జీకేవీధి మండలం దుప్పులవాడ పంచాయతీ పరిధిలోని శాండికోరి గ్రామంలో తాగునీటి పథకం పాడవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. గ్రామంలో తాగునీటి కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గతేడాది సోలార్ తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. సోలార్ సక్రమంగా పనిచేయడంతో సోలార్ బదులుగా విద్యుత్ సరఫరాలో మోటారు పనిచేసేలా చర్యలు చేపట్టారు. అయితే గత నాలుగు రోజులుగా తాగునీటి పథకం మోటారు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య నెలకొందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో చేతిబోరు కూడా పాడైనట్టు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

గృహ నిర్మాణ బిల్లులు చెల్లించాలి


తూరుమామిడిలో హౌసింగ్ లబ్ధిదారులు

పాడేరు రూరల్: మండలంలో కుజ్జెలి పంచాయతీ తూరుమామిడిలో గృహ నిర్మాణం బిల్లులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని హౌసింగ్ లబ్ధిదారులు రామరావు, శ్రీను, అర్జున్, లక్ష్మి తదితరులు బుధవారం ఆవేదన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ బిల్లులు త్వరితగతిన చెల్లిస్తామని ప్రకటించడంతో వడ్డీలకు అప్పులు చేసి గృహ నిర్మాణ పనులు చేపట్టామన్నారు. లింటల్, శ్లాబు దశల్లో గృహా నిర్మించుకున్న మొదటి బిల్లులు కూడా చేయకపోవంతో చేసిన అప్పులకు వడ్డీ చెల్లించుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. గతంలో హౌసింగ్ అధికారులను పలుమార్లు వినవించుకున్నా పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే బిల్లులు చెల్లించాలని లేనిపక్షంలో సంబంధిత కార్యాలయాల వద్ద ఆందోళన చేస్తామని వారు చెప్పారు.

రత్నాలమ్మ మృతికి పాడేరు ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: అంజలి శనివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకురాలు లకే రత్నాలమ్మ మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు బుధవారం గ్రామానికి చేరుకొని లకే రత్నాలమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట చింతపల్లి వైస్ ఎంపీపీ సాగిన వెంకటరావు, మాజీ సర్పంచ్ కిముడు బెన్నలింగం, లరె కళ్యాణ్, కిముడు పరమేశ్వరరావు తదితరులున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, బాలికలు

ముంచంగిపుట్టు: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీడీపీవో యు.విమలకుమారి అన్నారు. మండలంలో గల జోలాపుట్టు పంచాయతీ కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఇంగ్లిష్ మీడియం బాలికల పాఠశాలలో బుధవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిని విమలకుమారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. మ్యూజికల్ చైర్, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. బాలికల హక్కులపై అవగాహన ర్యాలీని నిర్వహించి, మానవహారం చేశారు.ఈ సందర్భంగా సీడీపీవో విమలకుమారి మాట్లాడుతూ బాలురుతో సమానంగా బాలికలు అన్ని రంగాల్లో పోటి పడాలని, ఉన్నత స్థాయికి ఎదగాలని, మహిళా హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు.

బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు.హెచ్‌ఎం గున్నయ్య,ఉపాధ్యాయులు రామయ్య, జగదీశ్వర్, మత్స్యరాజు, రమేష్, వెంకటలక్ష్మి, మధుసూదన్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌కు అస్వస్థత


పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న సూపర్‌వైజర్ వీరయమ్మ

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న వీరయమ్మ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశానికి హాజరై మధ్యలోనే అస్వస్థతకు గురయ్యారు. సమావేశంలో ఆమె ఉన్నట్లుండి కుర్చీలో కూలబడి పోవడంతో సహచర ఉద్యోగులు గమనించి ఆమెను వెంటనే స్థానిక పీహెచ్‌సీకు తరలించారు. సిబ్బంది ఆమెకు చికిత్స అందిస్తున్నారు. యూనియన్ లీడర్ వెంకటలక్ష్మి, సీడీపీవో సుజాత ఆమెను పరామర్శించి ధైర్యం చెప్పారు.

రహదారి కోసం ఆందోళన


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పాడేరు రూరల్: మండలంలో డోకులూరు పంచాయతీ దుమ్మపుట్టు గ్రామానికి రహదారి నిర్మించాలని గిరిజన సంఘం నేత చిట్టిబాబు ఆధ్వర్యంలో స్థానికులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామానికి రహదారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుత్తులపుట్టు సంతబయలు జల్లిపల్లి జంక్షన్ నుంచి దుమ్మపుట్టు, చింతగొంది, నేరడివలస, అల్లివరం, ఇరడాపల్లి, మీదుగా బొక్కెలు జంక్షన్ వరకు రోడ్డు అస్తవ్యస్తంగా మారిందన్నారు. పెద్ద పెద్ద గోతులతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా రహదారి మరింత కోతకు గురైందన్నారు. చందాలు వేసుకుని రహదారి గోతులు పూడ్చామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చొరవ తీసుకుని రోడ్డు నిర్మించాలని లేనిపక్షంలో చలో ఐటీడీఏ ఆందోళన కార్యక్రమం చేస్తామని హెచ్చరించారు. గ్రామస్తులు చిన్నయ్య, గణేష్, శ్రీను, జగన్, నగేష్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరు రూరల్: పాడేరు డివిజన్ పరిధిలో జి,.మాడుగుల సబ్ స్టేషన్ 33కెవి ఫీడర్ మరమ్మతు పనుల నేపథ్యంలో మండల వ్యాప్తంగా అని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఈఈ పి.వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు మండలంలో 11 కె.వి.బ్లాక్కెలు ఫీడర్ మరమ్మతు పనుల నేపథ్యంలో ఇరడాపల్లి, డోకులూరు, కించురూ పరిధిలోని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5గంటల విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

సీలేరు: సీలేరు అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం భక్తులు అయ్యప్ప మాలధారణ చేపట్టారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు దామోదర శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం జరిగింది. ఆలయంలో సుమారు 45 రోజులపాటు నిత్యన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. అన్నదానం కార్యక్రమానికి వితరణ చేసే దాతలు ఆలయ కమిటీ సభ్యులను సంప్రదించవచ్చని చెప్పారు.

నిలిచిన బీఎస్ఎన్ఎల్ సేవలతో ఇక్కట్లు


వంతాలలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

జి.మాడుగుల: మండలంలో వంతాల పంచాయతీలో గల రెండు వారాల నుంచి బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ సిగ్నల్స్ పనిచేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వినియోగదారులు చెబుతున్నారు. ఫోన్లు, నెట్ సేవలు పనిచేయకపోవడంతో సచివాలయంలో ప్రజావసర పనులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు అందుబాటులో తీసుకురావాలని వారు కోరుతున్నారు.

అధ్వాన దారితో అవస్థలు


బురుదలో కూరుకుపోయిన లారీని బయటకు తీస్తున్న స్థానికులు

కొయ్యూరు: కొమ్మిక రైతు సేవా కేంద్రంకు యూరియా తీసుకెళ్తున్న లారీ బుధవారం చోద్యం-కొమ్మిక రహదారిలో కూరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ అధ్వానంగా తయారైంది. దీంతో యూరియాను తరలిస్తున్న లారీ బురుదలో కూరుకుపోయింది. దీనిని బయటకు తీసేందుకు స్థానికులు తీవ్ర అవస్థలు పడ్డారు. అధ్వాన రహదారితో తరచూ ఇబ్బందులు పడుతున్నామని వాహనచోదకులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రహదారి బాగు చేయాలని వారు కోరుతున్నారు.

రైతుల దీక్ష

గూడెంకొత్తవీధి: హైవే విస్తరణలో భాగంగా నష్టపోయిన చెట్లకు పరిహారం ఇచ్చేందుకు వీలుగా ఐటీడీఏ పీవో, ఇన్‌చార్జి సబ్‌కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ జాతీయ రహదారి సంస్థకు నోటీసులను పంపించినట్టు తహసీల్దార్ అన్నాజీరావు తెలిపారు.ఈ మేరకు హైవే బాధితులకు త్వరలో పరిహారం వస్తుందని, దీక్షలను రైతులు విరమించాలని ఆయన బుధవారం పెదవలసలో దీక్షలు చేస్తున్న రైతులను కోరారు. రైతులు దీనిపై పునరాలోచన చేసి దీక్షలను విరమించాలని కోరారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని బి.రవికుమార్‌కు చెందిన పల్సర్ 220 బైక్ మంగళవారం అర్ధరాత్రి చోరీకి గురైంది. ఇంటి ఎదుట పార్క్ చేసి ఉంచిన బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. ఈ ఘటనపై బాధితుడు బుధవారం ఉదయం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి


వై.రామవరంలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు


వి.ఆర్.పురంలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది

వై.రామవరం: దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతిని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ తోట శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కలామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, ఉపగ్రహ ప్రయోగాల్లో దేశ ఖ్యాతిని ప్రపంచానికి చాటిన మేధావి అబ్దుల్ కలామ్ అని కొనియాడారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. అధ్యాపకులు శ్రీనివాసరావు, ఈశ్వర్‌కృప, మాణిక్యం, దొరబాబు, నఫీజ,పల్లేటి చంద్రశేఖర్, పాపారావు, శివయ్య, కుమారి, చంద్రశేఖరరెడ్డి, అబ్బులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వి.ఆర్.పురం: మండల కేంద్రంలో ఓ ప్రైవేట్ పాఠశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె.అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రామలక్ష్మి మాట్లాడుతూ దేశం గర్వించదగ్గ వ్యక్తి అబ్దుల్ కలామ్ అని కొనియాడారు. అనంతరం అయిన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రమ్య, లహరి, మీనా,అశ్విని, సుధ, దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు


మినుములూరులో సీమంతాలు చేస్తున్న సర్పంచ్ చిట్టమ్మ, సూపర్‌వైజర్ రాజేశ్వరి


అప్పలరాజుపేటలో సీమంతం చేస్తున్న సిబ్బంది

పాడేరు రూరల్: మండలంలో మినుములూరు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమంలో భాగంగా బుధవారం గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గర్భిణులకు పండ్లు, గాజులు, వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ లంకెల చిట్టమ్మ, సూపర్‌వైజర్ రాజేశ్వరిలు మాట్లాడుతూ అంగన్‌వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ఆస్పత్రుల్లోనే ప్రసవాలు చేయించుకోవాలన్నారు. మహిళ పోలీసు శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని అప్పలరాజుపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతం చేశారు. గర్భిణులకు పండ్లు, పసుపు కుంకుమలు, వస్త్రాలు అందజేశారు. ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు.చిన్నారులకు మిఠాయిలు పంచిపెట్టారు. వెలుగు వీవోఏ వీణారాణి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం


మాట్లాడుతున్న రాధాబ్రహం

కూనవరం: మండలంలోని చినార్కూరు చర్చి గ్రౌండ్‌లో రెవరెండ్ డాక్టర్ కటాక్షమ్మ, పాల్‌రాజ్ జయంతిని బుధవారం నిర్వహించారు. గుడ్ సమరిటన్ ఇవాంజికల్ లూథరన్ చర్చి (భద్రాచలం) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కళాశాల అడ్మినిస్ట్రేట్ ఆఫీసర్ రెవరెండ్ డాక్టర్ రాధాబ్రహం మాట్లాడుతూ క్రీస్తు సూచించిన శాంతి, సోదరభావం, ప్రేమ వంటివి పాటించి, ఆయన మార్గాన్ని అనుసరించాలని కోరారు. పాల్‌రాజ్, కటాక్షమ్మ దంపతులు స్థాపించిన జీయస్ఈఎల్‌సీ సంస్థ చేస్తున్న సేవలను కొనియాడారు. ఆసియా ఖండంలోనే తొలి మహిళా బిషప్‌గా కటాక్షమ్మ పేరొందన్నారు. ఎంపీపీ పాయం రంగమ్మ, సర్పంచ్ సున్నం అభిరాం, ప్రొఫెసర్ సీఎస్ఐ చర్చి (భద్రాచలం) ప్రెస్బిటేట్ గ్రూఫ్ చైర్మన్ రెవరెండ్ కె.తిమోతి విజయ కుమార్, జాన్, కరుణాకర్, జోషఫ్, ఆశీర్వాదం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన


పాడేరులో అవగాహన కల్పిస్తున్న వైద్యులు


చింతపల్లిలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సాహితి


అడ్డతీగలలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పలు పాఠశాలల ఉపాధ్యాయులకు సీపీఆర్ అత్యవసర వైద్యంపై బుధవారం అవగాహన కల్పించారు. గుండె నొప్పి, ఇతర సమస్యలతో బాధపడే రోగులకు తక్షణం అందించే సీపీఆర్ వైద్యసేవలను ప్రిన్సిపాల్ డాక్టర్ డి.హేమలతాదేవి, అనస్థషియా హెచ్‌వోడీ డాక్టర్ సతీష్‌కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉషారాణీలు సమగ్రంగా వివరించారు. జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మజీరావు, ఉపాధ్యాయులు సూర్యకళ, వెంకటరమణ, శాంతి కుమారి, రమణ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: సీపీఆర్ ప్రక్రియపై అవగాహన అవసరమని సీహెచ్‌సీ వైద్యుడు శ్రీ హర్ష అన్నారు.అడ్డతీగల సీహెచ్‌సిలో సిపిఆర్ అవేర్‌నెస్ వీక్ సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎవరైనా ప్రమాదశాత్తు ఏదైనా ప్రమాదానికి గురైనప్పుడు గుండె పనితీరుని మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన నివారణ చర్యలను వివరించారు. సీపీఆర్ అవశ్యకతను ప్రతి ఒక్కరూ గ్రహించాలని ఆస్పత్రి కౌన్సిలర్ నారే వాసు చెప్పారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్ ప్రక్రియపై ఏరియా ఆస్పత్రికి చెందిన డాక్టర్ సాహితి బుధవారం అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితిలో సీపీఆర్‌ను చేసే విధానాన్ని వివరించారు. సీపీఆర్ ఆవశ్యకత తదితర విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.